# మృచ్ఛకటికము

విద్వాన్ రత్తి సాంబమూర్తిశాస్త్రి గారు

౨

## మృచ్ఛకటికము-ముద్రారాక్షసము

(ఏప్రిల్ సంచిక తరువాయి)

మృచ్ఛకటికము రెండునాటకములై యుండి యుండుననియు, వానిలో నొకరెండు గ్రంథములను గలిపి యొకగ్రంథముగాఁ దయారుచేసి యుందురనియు, ఈవఱకు మృచ్ఛకటికమును గూర్చి వ్రాయుచు నిరూపించియుంటిని. కావుననే మృచ్ఛకటికమును దశాంకపరిమితగ్రంథమున బీజాదులు సమముగా లేవు. రెండునాటకములుగాఁ దీసినచో నాటకబీజములు రెంటను సమముగానే యున్నవి. నాందీశ్లోకములవలనఁగూడ నీవిషయమే స్పష్టపడుచున్నదని నిరూపించియుంటిని. ప్రస్తావనలోని

"తయోరిదం సత్సురతోత్సవాశ్రయం
నయప్రచారం వ్యవహారదుష్టతామ్,
ఖలస్వభావం భవితవ్యతాం తథా
చకార సర్వం కిల శూద్రకో నృపః"

దానిలోఁ జేర్పఁబడిన పద్యము షష్ఠాంకప్రభృతిదశాంకపరిమితగ్రంథభాగములోనిదే యనియు, దానినే శూద్రకుఁడు రచించెననియు మిగిలిన మొదటి యైదంకములను భాసుఁడే రచించియుండుననియు, చారుదత్తముచూచిన నీవిషయము తేటతెల్లమగుననియు నందే వ్రాసియుంటిని.

ముద్రారాక్షస మపూర్వనీతిప్రకాశకమై పాఠకులకు దుర్బోధమై తుది నత్యంతాశ్చర్యములను గలుగఁజేయుచుండును. అందాకవి యత్యంతనీతిశాస్త్రపారంగతుఁడై కామందకచాణక్యాది నీతిశాస్త్రనిష్ణాతవలెఁ గనుపించును. గ్రంథములోని కవిత్వము కాళిదాసకవిత్వమువలె మృదుమధురమై సరసభావసంపూరితమై వ్యర్థపదములుకానిదై యత్యంతానందదాయకమై విరాజిల్లుచున్నది. దానికితోడు నద్భుతకథాకల్పనము బంగారమునకు పరిమళము దెచ్చునట్లున్నయది. పాఠకమహాశయులందఱు నిట్టి గ్రంథరాజమును జూచి యానందించుట సహజమేకదా?

ఈకవికూడ నాటకబీజములను బీజబింద్వాదులను నాటకమంతటను సమముగా నిలిపెనని తన ముద్రారాక్షసములోఁ గొంతోక్తిగాఁ జెప్పియున్నాఁడు.

మృచ్ఛకటికమున షష్ఠాంకప్రభృతి దశాంకపరిమితకథాభాగమును గ్రహించినచో నందును బీజబింద్వాదులు సమముగాఁ నుండుగనని క్రిందటివ్యాసములోనే వ్రాసియున్నాను. అట్టియెడ నీమృచ్ఛకటికముకూడ నీతిప్రధానమగు నాటకమే యగును. ముద్రారాక్షసము నీతిప్రధానగ్రంథమని యెల్లరకుఁ దెలిసియుండుటచే మరల నిచట వ్రాయ నక్కఱలేదు. ఈరెండుగ్రంథములను రచించినవారును రాజులే కాన వానిని రెండింటిని జూచి కొంచెము పరిశీలించెదముగాక వింతలేమైన జనించునేమో?

ముద్రారాక్షసమును సరిగా విమర్శించినచో నయ్యది యొకగ్రంథమున కనుకరణమని తేలకపోదు. స్వతంత్రగ్రంథమైనచో నట్లు మొదటియంకమే దురవగాహమై యుండఁజాలదు. కాన నయ్యది యొకగ్రంథము

ననుకరించుచున్న దనవలసియున్నది. అయ్యది మృచ్ఛకటికమున కనుకరణమేయని యీవ్యాసములో నిరూపించుచున్నాను.

చూడుఁడు: మృచ్ఛకటికములో నాభరణములే చారుదత్తుఁడు వసంతసేనను జంపెనని రుజువు చేసినవి. అట్లే ముద్రారాక్షసములో ముద్రతోఁ గూడినలేఖ రాక్షసామాత్యుఁడు ద్రోహియని నిరూపించినది. మృచ్ఛకటికమున విమర్శకుఁ డధికరణికుఁడు. ముద్రారాక్షసమున మలయకేతువు. మృచ్ఛకటికమున వసంతసేన చారుదత్తునిబండిరెక్కి పుష్పకరండకజీర్ణోద్యానమునుగూర్చి క్రీడించుటకై వెళ్లుచున్నదని రక్షకభటాధ్యక్షుఁడగు వీరకునిసాక్ష్యము. అట్లే ముద్రారాక్షసమునఁ జాణక్యప్రేరితాభరణముల సాక్ష్యము. మృచ్ఛకటికమున వసంతసేన చచ్చిపడియున్నదని వీరకుఁడు చూచివచ్చిచెప్పుట. ముద్రారాక్షసమున మలయకేతుతండ్రియగు పర్వతకుని రాక్షసుఁడే చంపినట్లు పాత్రభేదము కలిగి యొకదాని నొకటి యనుకరించుచున్నట్లు కన్పట్టుచున్నది. మృచ్ఛకటికమును ముద్రారాక్షస మనుకరించినదా ముద్రారాక్షసమును మృచ్ఛకటిక మనుసరించినదాయని యిప్పుడు విచారింపవలసియున్నది. దానినే నాశక్తికొలఁది విమర్శింప ప్రయత్నింతును.

మృచ్ఛకటికములోని నీతిప్రయోగము ముద్రారాక్షస నీతిప్రయోగ మంత దృఢమైనది కాదని యూహించుచున్నాను. మృచ్ఛకటికములోని నేరమును నిపుణముగా పరిశీలించిన కేసు కొట్టివేయవచ్చును. ముద్రారాక్షసమున నెంత నిపుణముగా నాలోచించిన నంతవిపులముగా శిక్షవిధించుచు తీర్పు చెప్పవలసియుండును. దానినిబట్టి మృచ్ఛకటికము మొదటిదనియు దానినిజూచి ముద్రారాక్షసము రచింపఁబడినదనియు నిరూపింపవచ్చును.

మఱియు మృచ్ఛకటికమును విమర్శకులందఱును B. C. 8 శతాబ్దములోనిదనికాని A. D. I. శతాబ్దములోనిదనికాని యనుచున్నారు. ముద్రారాక్షసము నందఱును 8 A. D. లోనిదని యనుచున్నారు. కాఁగా ముద్రారాక్షసము మృచ్ఛకటికమునుజూచి పుట్టిన దనవచ్చును.

మఱియు మలయకేతుపరివారమంతయు చాణక్యప్రేరిత కపటపరివారమే. మృచ్ఛకటికమున నిట్లు లేదు.

"చారుదత్త వినాశాయ కరోమి కపటం నవమ్,
నగర్యాంహి విశుద్ధాయాం పశుబంధమివ దారుణమ్.

అను మృచ్ఛకటికములోని శ్లోకము ననుకరించి

"కౌలూత శ్చిత్రవర్మా మలయనరపతి
సైస్సింధవ స్సింధుషేణః,
కాశ్మీరః పుష్కరాక్షః క్షతరిపుమహిమా
వీరసింహో నృసింహః;
మేఘాఖ్యః పంచమోస్మిన్ పృథుతురగబలః
పారశీకాధిరాజో
నామా న్యేషాం లిఖామి ధ్రువ మహమధునా
చిత్రగుప్తః ప్రమార్ష్టు"

అను ముద్రారాక్షసశ్లోకము రచింపఁబడినది. మఱియు శ్రీచారుదత్తుఁడు వ్యవహారమండపమునకుఁ బోవుసందర్భములోని

"జ్ఞాతోపి కిన్ను ఖలు బంధనవిప్రయుక్తో
మార్గాగతః ప్రవహణేన మయాపనీతః,
చారేక్షణస్య నృపతేః శ్రుతి మాగతోవా
యేనాహ మేవ మభియుక్త ఇవ వ్రజామి"

అనుశ్లోకము ననుసరించి సందర్భానుసారముగా మార్చి

"ఛేత్తవ్యం నృపతే స్తత స్సచివతో
రాజ్ఞ స్తతో వల్లభా
దన్యేభ్యశ్చ వసంతి యేऽస్యభవనే
లబ్ధప్రసాదా విటాః
దైన్యా దున్ముఖపర్యనాపలపనైః
పిండార్థ మాయాస్యత
స్సేవాం లాఘవకారిణీంకృతధియ
స్థానే శ్వవృత్తిం విదుః"

అని చెప్పియున్నాఁడు.

చందనకవీరకులవలెనే సిద్ధార్థక సమిద్ధార్థకులను ముద్రారాక్షసములో నిలిపెను. అపాపుఁడగు చారుదత్తునివలెనే నిష్కల్మషుఁడును ధీరుఁడునగు స్వామిభక్తిరతుఁడు నగుచందనదాసునకు మరణదండనము విధింపఁబడెను. వసంతసేనవచ్చి చారుదత్తుని విడిపించిన

ట్లమాత్యరాక్షసుఁడు వచ్చి చాణక్యునికి వశపడి చంద్రగుప్తమంత్రిత్వము నంగీకరించి చందనదాసుని విడిపించెను. ఇట్టిముద్రారాక్షసకథా భాగమంతయు మృచ్ఛకటికమునుజూచి పుట్టినది. కాని యిందలినీతి దృఢపడుటకై సిద్ధార్థక జీవసిద్ధి భాగురాయణాదులను నిలిపి మంచి నిపుణముగా నీతిప్రయోగమును జేయించెను. మృచ్ఛకటికమున శకారపాత్ర తప్ప మిగిలినపాత్రములన్నియు సద్గుణవిరాజమానములని విమర్శకులకుఁ దెలిసియేయుండును. అట్లే రాక్షసుఁడుతప్ప మలయకేతు సమీపవర్తులందఱును చాణక్యప్రేరితులైన కపటులే యని తెలియవలసియున్నది.

ఇట్లన్నివిషయములలోను ముద్రారాక్షసము మృచ్ఛకటికము ననుసరించుచున్న దని గ్రహింపవలసియున్నదిగదా! ఇఁక నీగ్రంథములగూర్చి మఱికొన్ని యుదాహరణలు చూపవలసియున్నవి. కాని గ్రంథవిస్తరభీతి వానినన్నింటి నుదాహరింపక విడిచితిని.

మృచ్ఛకటికకర్త శూద్రకరాజని క్రిందటివ్యాసమున వ్రాసియుంటిని. ముద్రారాక్షసకర్త విశాఖదత్తుఁడనుమహారాజు. వీరిరువురును క్షత్రియపుంగవులే. కవితల్లజులే.

ముద్రారాక్షసమున విదూషకుఁడు లేఁడనియు మృచ్ఛకటికమునఁ గలఁడనియు, కొందఱు తలఁపవచ్చును. కాని మృచ్ఛకటికములోని విదూషకుఁడు విదూషకకృత్యము జరిపియుండలేదని సవినయముగా మనవి చేయుచున్నాను.

ముద్రారాక్షసము మృచ్ఛకటికమును షష్ఠాంకప్రభృతి దశాంకపరిమితకథాభాగమునుమాత్రమే సంపూర్ణముగా ననుకరించినది కాని మొదటియైదంకముల ననుకరించినదికాదు. దానికిఁ గారణము ప్రత్యేకముగా మృచ్ఛకటికము(షష్ఠాంకప్రభృతి దశాంకపరిమితకథాభాగము) లభించుటయే యైయుండవచ్చును. కాకపోయిన మొదటియైదంకములలోను జిత్రముగాఁ జూపినద్యూత చౌర్యాదులను ముద్రారాక్షసమందును సలుపఁ బోవునా? మొదటినుండితుదిదాఁక యనుకరించినమహాకవియుఁ డొక్కద్యూత చౌర్యాది చిత్రప్రదర్శనముల ననుకరింపకుండ విడిచెననుట యసంగతము కాకుండునా? మఱియు నీయిద్దఱు కవులును రాజనీతిని బ్రకాశింపఁజేయు గ్రంథములనే చేసిరి. అందు మృచ్ఛకటికమును బదియంకముల నాటకముగానే గ్రహించినచో దారిద్ర్యద్యూత చౌర్యాదులు గూడ శూద్రకరచితములేయని యంగీకరింపవలయును. శూద్రకుఁడు చక్రవర్తియని యందే వర్ణింపఁబడియున్నది. అట్టి మహారాజునకు చేతిలో కానియైన లేక తినఁ దిండియుఁ గట్టవస్త్రము లేక దారిద్ర్యము ననుభవించుచు గౌరవనీయులకు నెఱుఁగందుదు సంపన్నులచే నధఃకరింపఁబడుచున్న నిరుపేద యవస్థ యీట్లనుభవములోనికవచ్చెను? లేనున్న నాదారిద్ర్యము నట్లనుభవపూర్వకముగా నున్న ట్లెట్లు వర్ణింపఁ గలిగెను? ఇట్లే ద్యూతచౌర్యాదులనుబట్టియుఁ గూడ మన మూహింపవచ్చును. ఇఁక రాజనీతివిషయములు రాజులకందఱికంటె నెక్కువగాఁ దెలియుననుట నిర్వివాదము. వారు రాజనీతియందలి యభిమానముచే తమగ్రంథములలో నారాజనీతిని నిలుపఁ బ్రయత్నించుట సహజమే. అంతియకాని తన కననుభూతములగు దారిద్ర్యము చౌర్యము మున్నగువానిని స్వానుభవముకలవానివలె నట్లు శూద్రకమహారాజు వర్ణించెననుట యసహజమును నసంగతమును నని మనవిచేయుచున్నాను. మృచ్ఛకటిక షష్ఠాంకప్రభృతి దశాంకపరిమిత కథాభాగమేయనియు మొదటియైదంకములును భాసరచితమైన చారుదత్తమనియు, శూద్రకుఁడు షష్ఠాంకప్రభృతిదశాంకపరిమిత కథాభాగమునుమాత్రమే రచించెననియు నీవఱకు వ్యాసమున వ్రాసియుంటిని. ముద్రారాక్షసమును బట్టి యిదే నిజమని తేలుచున్న దని యిందు నిరూపించినాను. దీనిగూర్చి ప్రాచ్యపుస్తకపరిశోధకులు పరిశీలించిన నెచ్చటనైన షష్ఠాంకప్రభృతి దశాంకపరిమిత కథాభాగము మృచ్ఛకటికమను పేరితో దొరికిన దొరకవచ్చునని యూహించుచున్నాను. పరిశోధకులు పరిశీలింతురుగాక.

మృచ్ఛకటికములోని సౌభాగ్యములఁ గూర్చి యింకొకపరి ముచ్చటింతును.